TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 2 సంచిక : 45 ఆదివారం 10 - 11 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in






## ప్రధాని మోడీ అబద్దాల ప్రచారం ఆపాలి

- అబద్దాలు ఆపే వరకు నిజాలు చెబుతూనే ఉంటాం
- మహారాష్ట్ర ప్రచారంలో సిఎం రేవంత్

**ముంబై, నవంబర్9 :**

**మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఆయన అబద్దాలు మాననంత వరకు నిజాలు చెబుతూనే ఉంటామని అన్నారు.**

తెలంగాణలో ఇచ్చిన అన్ని హామీలు నేరవేరుస్తున్నామని.. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని మోడీ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. విభజన రాజకీయాలతో ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంల మీటింగ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రభుత్వంపై ప్రధాని మోడీ అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తామని స్పష్టం

2 లో



## ప్రశ్నించేవారంటే రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు?: కేటీఆర్

**జర్నలిస్ట్ అరెస్ట్ అప్రజాస్వామికమన్న కేటీఆర్**

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం**

**నిఘా వేసి.. రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేశారన్న హరీశ్ రావు**



హైదరాబాద్/ నవంబర్9 :

ప్రశ్నించే వారంటే సీఎం రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. జర్నలిస్ట్, వైఆర్ టీవీ రంజిత్‌ను అరెస్ట్ చేయడంపై కేటీఆర్, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ అరెస్ట్ అప్రజాస్వామికమని కేటీఆర్ మండిపడ్డారు.

రాష్ట్రంలో ఎవరు ప్రశ్నిస్తే వాళ్లపై అక్రమ కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని విమర్శించారు. మీ 11 నెలల పాలనలో జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి చేసే దద్దమ్మ పనులను నిలదీసినందుకే జర్నలిస్ట్ రంజిత్‌ను నిర్బంధించారన్నారు. అతనిని వెంటనే విడుదల చేయాలని... అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. జర్నలిస్ట్ అరెస్టును హరీశ్ రావు ఖండించారు. నిఘా

2 లో

## రైతులకు ధైర్యం చెప్పిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**రైతులు అధైర్యపడవద్దన్న మంత్రి**

**పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ**

**డిసెంబరు నెలాఖరులోగా పెండింగ్ రుణమాఫీ చేస్తామని వెల్లడి**



2 లో

## 370 పునరుద్ధరణపై కాంగ్రెస్‌కు ఎందుకు ప్రేమ

**దేశమంతా ఒక్కటిగా ఉండడం ఇష్టం లేని కాంగ్రెస్**

**ఎటిఎంలుగా మారిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు**

**మహారాష్ట్ర ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు**

ముంబై, నవంబర్9 :

ఆర్టికల్ 370ని రద్దు చేసినా తిరిగి పునరుద్ధరించాలని కాంగ్రెస్ పట్టుబడు తోందని..అదంటే వారికి ఎందుకు అంత ప్రేమ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశ్నించారు. దేశమంతా ఒక్కటిగా ఉండడం వారికి ఇష్టం లేదన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను ఎటిఎంలుగా మార్చు కుందని దుయ్యబట్టారు. మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తుం డడంతో ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రజలు భాజపా,



మహాయుతికూటమికి మద్దతుగా ఓట్లు వేయాలని కోరారు. మహాయుతి ప్రభుత్వం మాత్రమే రాష్ట్రంలో వేగవంతమైన పురోగతిని తీసుకొస్తుం దన్నారు. ప్రతిపక్షం మహా వికాస్

2 లో

## నవంబర్ 11న హైదరాబాద్‌లో నీటి సరఫరాకు అంతరాయం



హైదరాబాద్/ నవంబర్9 :

హైదరాబాద్‌లో ఈనెల 11న (సోమవారం) తాగునీటి సరఫరాకు హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న (సోమవారం) తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. మరమ్మతుల దృష్ట్యా ఉదయం

2 లో

## సీఎం రేవంత్ రెడ్డి ఒకరి చావును కోరుకోవడం ఎంత వరకు సమంజసం? - సబితా ఇంద్రారెడ్డి

**సీఎం మాట్లాడుతుంటే టీవీలు బంద్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శ**

**తెలంగాణ ప్రదాత కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు శోచనీయమని వ్యాఖ్య**

**సభ్య సమాజానికి సీఎం ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్న**



హైదరాబాద్/ నవంబర్9 :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకరి చావును కోరుకోవడం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మండిపడ్డారు. నిన్న

2 లో

## వచ్చే సంవత్సరానికి సెలవులు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

**27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ప్రకటించిన ప్రభుత్వం**

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి**

**జనవరి 1న సెలవు ప్రకటించిన ప్రభుత్వం**

హైదరాబాద్/ నవంబర్9 :

2025 ఏడాదికి గాను సాధారణ, ఐచ్ఛిక సెలవుల (ఆప్షనల్ హాలిడేస్) జాబితాను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. మొత్తం 27 సాధారణ

2 లో

## కులగణనపై రాహుల్ గాంధీ ట్వీట్... స్పందించిన రేవంత్ రెడ్డి

**తెలంగాణలో కులగణన ప్రారంభమైందన్న రాహుల్ గాంధీ**

**కులగణనతో సరికొత్త విప్లవయాత్రకు శ్రీకారం చుట్టామన్న సీఎం**

**రాహుల్ వాగ్దానం మేరకు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం సాకారం కానుందని వ్యాఖ్య**



హైదరాబాద్/ నవంబర్9 :

తెలంగాణ కులగణన సర్వే చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన ప్రారంభమైందని... రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి

2 లో

# ప్రధాని మోడీ అబద్దాల ప్రచారం ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. రైతులకు హామీ ఇచ్చిన మేరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రైతులపై ప్రధాని మోడీ వేసిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాక ఆయన పోస్ట్ డిలీట్ చేశారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. రైతులకు సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం.. సామాజిక న్యాయం కోసం రాష్ట్రంలో కులగణన చేపట్టామని పేర్కొన్నారు. హామీల వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధమని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశంలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలో నమోదు అవుతున్నాయని మహాయతి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర అంటే శివాజీ మహారాజ్ గుర్తుకు వస్తారని అన్నారు. ఈ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. మహారాష్ట్ర భాజపా నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్దాలు చెబుతున్నారు. ఆయన అబద్దాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన భాజపాను ఎన్నికల్లో ఓడించాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రశ్నించేవారంటే రేవంత్ రెడ్డికి అంత కోపం ఎందుకు?: కేటీఆర్

వేసి, రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లు వేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పులను ఎత్తిచూపితే అరెస్ట్ చేయడమేమిటన్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్ట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# 370 పునరుద్దరణపై కాంగ్రెస్‌కు ఎందుకు ప్రేమ

అఘాడీ అంటే అవినీతి, వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు కేంద్రమని ఆ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు కుంటుపడుతుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీల్లో ప్రదర్శించే రాజ్యాంగం అసలైనది కాదని..నకిలీదని మోదీ పేర్కొన్నారు. ఎరుపు రంగు అట్టవేసి ఉన్న ఖాళీ పేజీల పుస్తకాన్ని చూపిస్తూ..రాజ్యాంగం అని ప్రచారం చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డా.అంబేద్కర్‌పై కాంగ్రెస్‌కు ఉన్న నిర్లక్ష్యానికి, ద్వేషానికి ఇది నిదర్శనమని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల వరుసలో భారత్‌ను నిలబెట్టడానికి భాజపా, దాని మిత్రపక్షాలు కృషి చేస్తున్నాయని..ఇది దేశ ప్రజలకు తెలుసని అందుకే అన్ని రాష్ట్రాల ప్రజలు భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలకు మద్దతిస్తున్నారని తెలిపారు. హరియాణా ఎన్నికల్లో జరిగిందే మహారాష్ట్రలోనూ పునరావృతం అవుతుందని మోదీ పేర్కొన్నారు. తాము అధికారం లోకి వస్తే మహిళా సాధికారతే లక్ష్యంగా మరిన్ని పథకాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 288 శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆ రాష్ట్రం పార్టీ 'షాహీ పరివార్'కు ఎటిఎంగా మారుతుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆరోపించారు.

ఈ నెల 20 నాటి మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి అకోలాలో ఒక ప్రచారం ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎటిఎం కానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అంత ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నప్పుడు అధికారంలో ఉంటే ఆ పార్టీ ఎంత అవినీతిమయంగా ఉంటుందో ఎవరైనా ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. 'కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రం పార్టీ షాహి పరివార్‌కు ఎటిఎంగా మారిపోతుంది. మహారాష్ట్ర ఎన్నికల కోసం కర్నాటకలోని మద్యం వ్యాపారుల నుంచి రూ. 700 కోట్లు బలవంతంగా వసూలు చేశారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఆ షాహీ పరివార్ ఎటిఎంలుగా మారాయని మోడీ ఆరోపించారు. మహాయుతి మహిళల భద్రత, ఉద్యోగావకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, కాంగ్రెస్, శివసేన (యుబిటి), శరద్ పవార్‌కు చెందిన ఎన్‌సిపి (ఎస్‌పి)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) 'అవినీతి పత్రం'తో వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

'ఎంవిఎ అంటే అవినీతి, టోకెన్ డబ్బు, బదలీ నియామక వ్యాపారం అనేదని మొత్తం దేశానికి తెలుసు' అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రధాని మరింతగా తూర్పారపడుతూ, పార్టీ షాహీ పరివార్ ఎన్నడైనా బాబాసాహెబ్ అంబేద్కర్ 'పంచ్‌తీర్థ్'ను సందర్శించారా అని తాను సవాల్ చేస్తున్నానని చెప్పారు. మధ్య ప్రదేశ్‌లోని మ్హోలోని అంబేద్కర్ జన్మస్థలం, యుకెలో ఆయన చదువుకున్నప్పుడు లండన్‌లో ఆయన బస చేసిన ప్రదేశం, నాగ్‌పూర్‌లో ఆయన బౌద్ధమతం స్వీకరించిన దీక్ష భూమి, ఢిల్లీలోని ఆయన 'మహాపరినిర్వాణ్ స్థల్', ముంబయిలోని 'చైత్య భూమి'ని ఉద్దేశించి మోడీ 'పంచ్‌తీర్థ్' పదం ప్రస్తావించారు.

'బాబాసాహెబ్ దళితుడు కనుక, రాజ్యాంగం రూపకల్పన ఘనత ఆయనకు దక్కినందున ఆయనను వారు ద్వేషిస్తారు. బాబాసాహెబ్ నాకు, బిజెపి, నా ప్రభుత్వానికి ఒక స్ఫూర్తిదాత. ఆయన వారసత్వ సంపదకు సంబంధించిన ప్రదేశాలను మా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మా యుపిఐకి భీమ్ యుపిఐ అని నామకరణం చేశాను' అని మోడీ తెలియజేశారు.

కులాలు, మతాలను పరస్పరం వైరి వర్గాలుగా మార్చడం, దళితులు, వెనుకబడిన వర్గాలు సమైక్యం కాకుండా నిరోధించడం కాంగ్రెస్ గేమ్ ఎ-లాన్ అని, అయితే, 'ఏక్ హై తో సేఫ్ హై' అనే మంత్రాన్ని అనుసరించి హర్యానా ప్రజలు ఆ కుట్రను భగ్నం చేశారని మోడీ అన్నారు. దేశం దుర్బలంగా ఉంటేనే తాను పటిష్ఠం కాగలనని కాంగ్రెస్‌కు తెలుసు అని ఆయన పేర్కొన్నారు. గడచిన రెండు విడతలలో తన ప్రభుత్వం నాలుగు కోట్ల మందిపేద ప్రజలకు ఇళ్లు సమకూర్చగలిగిందని, మరి మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నదని మోడీ తెలిపారు, తన మూడవ విడతలో మహారాష్ట్రలోని వాధవాన్ రేవుతో సహా అనేక లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని, అది పూర్తి అయితే దేశంలోనే అతి పెద్దది అవుతుందని ప్రధాని మోడీ చెప్పారు.

## కులగణనపై రాహుల్ గాంధీ ట్వీట్... స్పందించిన రేవంత్ రెడ్డి

సంబంధించిన విధానాలను రూపొందించడానికి ఈ డేటాను వినియోగిస్తామని ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మహారాష్ట్రలోనూ ఇదే జరగనుందని... పార్లమెంట్‌లో ఈ కులగణను ఆమోదించి, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం అడ్డుగోడలను బద్దలు కొడతామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ... రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణలో ఈరోజు కులాల సర్వే గణన ప్రారంభంతో సరికొత్త విప్లవయాత్రకు శ్రీకారం చుట్టామని రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సామాజిక న్యాయం సాకారం కానుందని పేర్కొన్నారు. కులగణన చేపట్టిన కార్యక్రమం చేపట్టిన ఈ రోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు.

# రైతులకు ధైర్యం చెప్పిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్/ నవంబర్9 :**

మద్దతు ధరపై తెలంగాణ రైతులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధైర్యం చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని.. పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డిసెంబరు నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామన్నారు.

రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామని వెల్లడించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. డిసెంబరులో గ్రూప్ 1 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఒకరి చావును కోరుకోవడం ఎంత వరకు సమంజసం? – సబితా ఇంద్రారెడ్డి

మూసీ పునరుద్ధరణ యాత్ర సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సబితా ఇంద్రారెడ్డి స్పందించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే టీవీలు బంద్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రదాత కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు శోచనీయమన్నారు. సభ్య సమాజానికి సీఎం ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలని నిలదీశారు. తన పుట్టినరోజు నాడు కూడా సీఎం... కేసీఆర్ పేరు ఎత్తకుండా ఉండలేకపోయాడని విమర్శించారు. దీనిని బట్టే కేసీఆర్ అంటే ఎంత భయమో తెలుస్తోందన్నారు.

## రేపు మహబూబ్ నగర్ జిల్లాలో సీఎం పర్యటన

సీఎం రేవంత్ రెడ్డి రేపు మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. చిన్నచింతకుంట మండలంలో అమ్మాపూర్ కురుమూర్తిస్వామి వారిని దర్శించుకోనున్నారు. రేపు మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయం సమీపంలో ఘాట్ రోడ్డు కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

# వచ్చే సంవత్సరానికి సెలవులు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఏడాది సందర్భంగా జనవరి 1న ప్రభుత్వం సెలవును ప్రకటించింది. ఇందుకు బదులుగా ఫిబ్రవరి 10న రెండో శనివారాన్ని పనిదినంగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

# నవంబర్ 11న హైదరాబాద్‌లో నీటి సరఫరాకు అంతరాయం

6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరా ఉండబోదని అధికారులు వెల్లడించారు. ఆర్సీపురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, గంగారం, మదీనాగూడ, మియాపూర్, బీరంగూడ, అమీన్‌పూర్, ఎర్రగడ్డ, కేపీహెచ్‌పీ, మూసాపేట, చందానగర్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండబోదని.. స్థానికులు సహకరించాలని కోరారు.

# కులగణనపై మంత్రి పొన్నం ప్రభాకర్ షాకింగ్ కామెంట్స్

**హైదరాబాద్/ నవంబర్9 :**

కులగణనకు బీజేపీ అనుకూలమా కాదా ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ డా. లక్ష్మణ్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశవ్యాప్తంగా సర్వే చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెస్తారా లేదా అని నిలదీశారు. తెలంగాణలో కులగణన సర్వేపై లక్ష్మణ్ అభిప్రాయం చెప్పాలని ప్రశ్నించారు. ఇవాళ(శనివారం)గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల కోసం కులగణన జరుపుతున్నామని బీజేపీ నేతలు అంటున్నారని అన్నారు. సర్వేను అడ్డుకోవాలని చూస్తే లక్ష్మణ్ ద్రోహిగా మిగిలిపోతారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలా వద్దా అని నిలదీశారు. బీజేపీ ఎన్నికల్లో పూర్తిగా మతం రంగును పూసిందని ఆరోపించారు. లక్ష్మణ్ మీద గౌరవం ఉండేదని, కానీ ఇప్పుడు ఆ గౌరవాన్ని పోగొట్టుకున్నారని అన్నారు. బలహీన వర్గాలను అవమానించే విధంగా లక్ష్మణ్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బీజేపీ వ్యతిరేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

"బీజేపీ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాజస్థాన్‌లో రిజర్వేషన్



అమలు చేస్తుంటే హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేశారు. వీపీ సింగ్ రిజర్వేషన్లు తెస్తే కమండలం పేరు మీద పదవి నుంచి తప్పించారు. బలహీన వర్గాలకు చెందిన మోదీ బీసీల కోసం పదేళ్లలో ఏమైనా చేశారా చెప్పాలి. తెలంగాణలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి బీసీ అధ్యక్షుడిని తీసేశారు. సివిల్ సొసైటీలో అందరి అబిప్రాయం తీసుకుని కులగణన చేస్తున్నాం. కులగణనకు అడ్డం పడటానికి బీజేపీ చాలా ప్రయత్నాలు చేస్తుంది. ప్రభుత్వం ఏ డాక్యుమెంట్ అడగట్లేదు. సమాచారాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. బీఆర్ఎస్ సర్వే చేపట్టలేకపోయింది. మేము చేస్తున్నాం సహకరించండి. మూసీ పరివాహక ప్రాంత ప్రజల జీవన విధానం మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రక్షాళన చేస్తున్నారు. మీరు చేయలేని ప్రక్షాళన మేము చేస్తున్నాం సహకరించాలి.. వీలయితే సపోర్ట్ చేయాలి" అని మంత్రి పొన్నం ప్రబాకర్ అన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకోము..

"మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ అన్నట్లు కులగొట్టిన ప్రాంతాలకు వస్తాం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు, వారిచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయి. ముందుగా చెప్పాలి. కిషన్ రెడ్డి ఏవిధంగా హైదరాబాద్‌కు ఉపయోగపడుతున్నారో టవర్ సర్కిల్ దగ్గర చర్చకు సిద్ధమా అంటే సప్పుడు చేయలేదు. జైలు కట్టినం కేసీఆర్ కుటుంబం అంతా జైలుకే అని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్‌ని పామ్‌హౌస్ కేసులో ఎందుకు అరెస్ట్ చేయట్లేదని బండి సంజయ్ అంటున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మేము అరెస్ట్ చేయం. కేటీఆర్ , కేసీఆర్, హరీష్ రావులను అరెస్ట్ చేస్తామని మేము అనలేదు. పదేళ్లు అధికారంలో ఉండి ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ పట్టింది మీరు కాదా. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాబోయే పార్లమెంట్ సెషన్‌లో ఢిల్లీకి వెళ్లి కొట్లాడతాం. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండక పోతే మీరు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU


# ఖమ్మం జిల్లాలో "ఇండియన్ మాల లాయర్ల అసోసియేషన్" ఆవిర్భావం



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: ఖమ్మం లో "మాల అడ్వకేట్స్" తో శనివారం తల్లంపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో "ఇండియన్ మాల లాయర్ల అసోసియేషన్" కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఐ ఎం ఎల్ ఏ కి అధ్యక్షులు గా రెంటాల ఆనంద్, ఉపాధ్యక్షులు గా పి. బాలకృష్ణ (ఇల్లందు బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు) ప్రధాన కార్యదర్శి గా మద్రి ప్రకాష్, సహాయ కార్యదర్శి గా పప్పుల రత్నాకర్, కొశాధికారీగా కొనకంచి శ్రీ చరణ్ లను ఎన్నుకోగా గౌరవ సలహా దారులుగా పల్లా రాజశేఖర్, పి ఏ జె శేఖర్ రాజు, క్రిస్టోపర్ మోజెస్ కార్యనిర్వాహక సభ్యులుగా గోరింట్ల శాంతారావు, పిడతల రామ్మూర్తి, గుడిసె అనిల్ లను ఎన్నుకోగా గౌరవ సలహా దారులు మరియు అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తిలో "మాల" న్యాయవాధులందరు ఐక్యంగా ఉంటూ మన మొచ్చిన సమాజానికి సపోర్టుగా నిలిచి చేయూత నిస్తూ,రాష్ట్ర దేశాభివృద్ధిలో డా బి ఆర్ అంబేద్కర్ చూపిన బాటలో పయనిస్తూ ఆదర్శంగా ఐక్యంగా ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల లాయర్లు హాజరైనారు.

# రాణి ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి




ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: సత్తుపల్లి పట్టణంలోని వేంసూర్ రోడ్ లో నూతనంగా నిర్మించిన "రాణి సెలబ్రేషన్స్ ఏసీ ఫంక్షన్ హాల్" ను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ యజమాని తోట గణేష్ , సుజలా రాణి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు మంత్రి పొంగులేటిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణ , రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్ లో కలవర పెడుతున్న కల్తీకల్లు


**-రోజురోజుకు పెరుగుతున్న బాధితులు**

**-చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు**



వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు: వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో కల్తీ కల్లు విక్రయిస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నరు. వింత మత్తుకు అలవాటు చేసి వారి కుటుంబాలను వీధిన పడేస్తూ..అడ్డంగా సంపాదిస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో దర్జాగా కల్తీ కల్లు వ్యాపారం కొనసాగుతుందని ప్రజల ఆరోపిస్తున్నారు. రెండు రోజులు కల్లు తాగకుండా ఉంటే మూర్ఛ (ఫిడ్స్) వచ్చి పడిపోతున్న పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు కోసం ఇందులో రకరకాల రసాయనాలు కలుపుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్తీ కల్లు తాగి మూర్ఛ వ్యాధి బారిన పడుతున్న బాధితులు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి కల్లు నమూనాలు సేకరించి కల్తీ కల్లును గుర్తించి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గ్రామ పెద్దలు, నాయకులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నీలాద్రీశ్వర ఆలయంలో మంత్రి పొంగులేటి ప్రత్యేక పూజలు



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: పెనుబల్లి మండలంలోని నీలాద్రి గ్రామంలోని శ్రీ నీలాద్రీశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ రెవెన్యూ , గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉదయం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో మంత్రిని సత్కరించారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ తదితరులు ఉన్నారు.

# బాధలు మావి... వసూళ్లు వాళ్ళవి

**- చందా పేరుతో పదిలక్షల వసూళ్లు**

**- డబ్బులు అడిగినందుకు గెంటివేత**

**- పోలీసులను ఆశ్రయించిన దక్కని ఫలితం**

**- విలేకరుల సమావేశంలో గోడు వెల్లబోసుకున్న బాధితులు**

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: కరెంటు షాక్ తో 70% కాలిపోయిన శరీరంతో ఉన్న కొడుకును కాపాడుకునేందుకు కన్నీరు మున్నీరవుతూ తల్లిదండ్రులు హుటా హుటిన ఖమ్మం, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం, కొడుకు ప్రాణాలు కాపాడుకోవడం కోసం హైదరాబాదు వెళ్లి రెండు మూడు నెలలుగా ఉన్నదంతా ఖర్చు పెట్టుకుంటూ కొడుకు ప్రాణాలు దక్కించుకునేందుకు చేస్తున్న ప్రయత్నం ఒకటైతే.. చందాల పేరుతో వాళ్ళ కొడుకు ఫోటో పెట్టి కొందరు పది లక్షల వరకు వసూళ్ళు చేసుకున్న వైనం మరొకటి. ఆ విషయం తెలిసి అడిగినందుకు.. దిక్కున కాడ చెప్పుకో పో అని కిరాయికి ఉన్న ఇంటిలో నుండి గెంటి వేశారని పెంతల శోభ ఆవేదన వ్యక్తం చేసింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. ఖమ్మం రూరల్ మండలం, శ్రీ సాయి గణేష్ నగర్, రోడ్ నెంబర్ 14లో శోభ తన భర్త మధు ఇద్దరు పిల్లలతో కలసి పోట్ల శ్రీనివాసరావు ఇంట్లో ఏడు వేలు అద్దె చెల్లిస్తూ గత రెండు సంవత్సరాలుగా నివాసం ఉంటూ చిన్నపాటి కిరాణం నడుకుంటున్నారు. ఈ క్రమంలో జూలై 4న దాబాపై ఆడుకుంటున్న తమ కుమారుడు భరత్ (9) కు ఇంటి పైన ఉన్న 33/11 కెవి విద్యుత్ తీగలు తగలడంతో 70% శరీరం కాలిపోయింది. విగత జీవిగా పడిఉన్న తమ కుమారున్ని చూసి హుటాహుటిన ఖమ్మం ఆస్పత్రికి, అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తీసుకువెళ్లి సుమారు పది లక్షల రూపాయలు ఖర్చు పెట్టినప్పటికీ ప్రాణం దక్కింది కానీ సగం కాలిపోయిన ఎడమ కాలు తీసేసారని, కుడికాలుకు కూడా శస్త్ర చికిత్స చేస్తే నడవలేని స్థితిలో ఉన్న కొడుకును అంటిపెట్టుకొని ఉంటూ సొంత ఊరు సత్యనారాయణపురం నుండి డబ్బులు కూడపెట్టుకుంటూ వైద్యం కోసం మా బాధలు మేము పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. కరెంట్ షాక్ విషయమై శ్రీ సాయిగణేష్ నగర్ లో కిరాయి కుంటున్న ఇంటి యజమాని పోట్ల




శ్రీనివాసరావు, నరేందర్ రెడ్డి, రమేష్, ప్రసాద్ లు మా బాబు ఫోటో పెట్టి కరెంట్ షాక్ తగిలిన బాబుకు దాతలు సహాయం చేయాలని గ్రూపుల్లో పోస్టు పెట్టి సుమారు పది లక్షల వరకు వసూళ్లు చేశారని ఆరోపించింది. దాతలు ఇచ్చిన డబ్బులు అడిగినందుకు ఒక లక్ష, 22వేలు ఇచ్చి మిగతావి ఇవ్వకుండా పోలీస్ కేసు ఎందుకు పెట్టావని..? మిగతా డబ్బులు ఇవ్వము ఏం చేసుకుంటావో చేసుకో.. పో అని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించింది. అంతేకాకుండా ప్రతి నెల కిరాయి కట్టుకుంటూ ఉన్న ఇంటిలో నుండి సమాచారం ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా సామాన్లు అన్ని బయటపడేసి ఇబ్బందులకు గురిచేస్తూ భయపెడుతున్నారని ఇట్టి విషయమై పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన కాలయాపనం చేస్తూ తిప్పుకుంటున్నారని వాపోయింది. జిల్లా అధికారులు స్పందించి, విచారణ చేసి బాబు ఫోటోతో దాతలు నుండి నలుగురు వసూళ్లు చేసిన పది లక్షల సొమ్మును ఇప్పించి కొడుకు సంపూర్ణ ఆరోగ్యానికి సహకరించి న్యాయం చేయాలని, బంగారం, నగదు, ఖరీదైన వస్తువులతో కూడిన సామాన్లు ఇంట్లో నుండి బయట పడేసిన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని వేడుకొంది. ఈ విలేకరుల సమావేశంలో భర్త మధు, కొడుకు భరత్ లు ఉన్నారు.

# చివర గింజ వరకు కొంటాం...!

**- మద్దతు ధర ఇస్తాం... రైతులు అధైర్య పడొద్దు**

**- డిసెంబర్ పూర్తి లోగా పెండింగ్ 13 వేల కోట్ల రుణమాఫీ**

**- కూసుమంచి తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి/ షాదీముబారక్ చెక్కులను పంపిణీ**



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామనిహొతెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ/షాదీ ముబారక్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... వరి పంట సాగు చేసిన రైతులు నిర్భయంగా ఉండాలని, చివరి గింజ వరకు మద్దతు ధరపై ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,హొఅదే విధంగా సన్న వడ్లకు క్వింటాల్హొకు అదనంగా రూ. 500 రూపాయలు చెల్లిస్తామని అన్నారు. గత ప్రభుత్వాలు రైతుల పట్ల ఎలా వ్యవహరించాయో అందరికీ తెలుసన్నారు.హొప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న అప్పులు తీరుస్తూ,హొఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, మరో 13 వేల కోట్లు మాఫి చేయాల్సి ఉందని, డిసెంబర్ నెలాఖరు నాటికి పెండింగ్ రుణమాఫీ చేస్తుందని అన్నారు. నిరుద్యోగ యువతకు ప్రజా ప్రభుత్వం వచ్చిన పది నెలల వ్యవధిలో 57 వేల పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3హొపోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించామని, డిసెంబర్ నెలలో వారికి ఉద్యోగాల అపాయింట్మెంట్ ఆర్డర్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామనిహొ మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తప్పనిసరిగా అమలు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా 61 మంది కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ లబ్ధిదారులకు రూ. 61,07,076 ల చెక్కులను పంపిణీ చేశారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెం లో ఇటీవలి వరదల్లో మృతి చెందిన షేక్ యాకుబ్, సైదాబీ దంపతుల కుమారులు షేక్ యూసుఫ్, షేక్ షరీఫ్ లకు కూసుమంచి మండల కేంద్రంలో ఇండ్ల స్థల పట్టాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు,స్పెషల్ క్యాంపెన్ డే ! ఆర్డీవో సుచిత్ర..

బాపట్ల జిల్లా! రేపల్లె : ఎలక్షన్ ఎలక్షన్ ఉత్తర్వులు ప్రకారం రేపల్లె నియోజకవర్గం 9 ,10 తారీకులలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బూత్ లెవెల్ అధికారులకు తెలియజేయడమైనది, అందులో భాగంగా ఈరోజు రేపల్లె మండలం, రూరల్ పెనుమూడి గ్రామపంచాయతీ పరిధిలో పోలింగ్ బూత్ మరియు చెరుకుపల్లి మండలం, చెరుకుపల్లి పోలింగ్ బూత్ పరిశీలించి అనంతరం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చినటువంటి క్లెయిమ్స్ మరియు ఓటర్ జాబితాలో ఉన్నటువంటి తప్పులు చూసుకొని సవరణ చేయవలసినదిగా బూత్ లెవెల్ అధికారులకు ఆర్డిఓ తెలియజేసినారు, ఈ కార్యక్రమంలో రేపల్లె తాసిల్దార్ మోర్ల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు,

# శ్రీ శ్రీ శివ రామంజనేయ స్వామి వారి దేవాలయానికి హుండీ వితరణ

## - దాతలు అక్కల పద్మ వెంకట్రాములు గౌడ్ దంపతులు



వనపర్తి జిల్లా ప్రతిని తెలంగాణ ముచ్చట్లు: మహబూబ్ నగర్ నగర్ జిల్లా అడ్డకల్ మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన అక్కల పద్మ వెంకట్రాములు గౌడ్ ఆర్టీసీ కండక్టర్ గ్రామ దేవాలయానికి ఈ పుణ్య దంపతులు సంపాదనలో ఎంతో కొంత సమాజానికి గ్రామానికి చెయ్యాలనే ఆలోచన వారికి రావడం చాలా గొప్ప విషయం,అలాంటి ఆలోచనలు చేతల్లో చూపిన వారు అందరికి ఆదర్శ అవుతారు. తమ సొంత ఊరు దేవాలయానికి తమ వంతుగా ఈ పుణ్య దంపతులు లాకర్ హుండీ ని 40,000 /-వేల రూపాయాతో తయారు చేపించి ఈరోజు దేవాలయంలో కార్తీక శనివారం సందర్భంగా శివుడికి రుద్రాబీషేకం ఆంజనేయస్వామి కి ఆకుల పూజ తర్వాత హుండీకి పూజా కార్యక్రమంలు పురోహితులు సురేష్,తారకేశ్వర్ అయ్యా గారులు చేసి గుడిలో పెట్టడం జరిగింది. గ్రామ దేవాలయానికి చేసిన సహాయానికి దేవాలయ కమిటీ వారు దంపతులను వేద పండితులు సురేష్,తారకేశ్వర్ అయ్యగారుల చేత వారిని సన్మానించి ఆశీర్వచనాలు అందజేయడం జరిగింది గ్రామ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మ వెంకట్రాములు గౌడ్ కుటుంబ సభ్యులు,గ్రామ మహిళా మణులు,గ్రామ పెద్దలు,యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది,.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
## - సర్వే పట్ల ప్రజల అపోహలు తొలగిస్తూ అవగాహన కల్పించాలి
## - సర్వేలో గుర్తించిన కుటుంబ వివరాలను ఆన్ లైన్ లో పొందుపరచాలి
## - ఖమ్మం నగరంలోని సారథి నగర్ లో జరుగుతున్న ఇంటింటి సర్వేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఖమ్మం జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఖమ్మం నగరంలోని సారథి నగర్ లో ఎన్యూమరెటర్లు, అధికారులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ జరుగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. సర్వే జరిగే సమయం సంబంధిత ప్రజలకు ముందుగానే తెలిసేలా ప్రచారం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వేను సకాలంలో ప్రారంభించాలని, ప్రతి కుటుంబం దగ్గర సంపూర్ణంగా వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా సేకరించాలని, ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే పట్ల ప్రజలకు ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించాలని, ఈ సర్వే కారణంగా ఎటువంటి ప్రభుత్వ పథకాలు కట్ కావని ప్రజలకు తెలియజేయాలని, సర్వే సంబంధిత వివరాలు సక్రమంగా నమోదు చేయాలని ప్రజలు ఈ



సర్వేలో పాల్గొనడానికి ప్రోత్సహిస్తూ అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సర్వేలో ప్రతి కుటుంబం పాల్గొనాలని ఏ ఒక్క ఇంటిని వదలకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని, సర్వే సమయంలో ఎటువంటి సమస్య తలెత్తిన వెంటనే పై అధికారులకు ఎన్యూమరేటర్లు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి డిప్యూటీ సిఇఓ నాగలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# "ఆక్టోపస్, పోలీసు"దళాలు మాక్ ఆపరేషన్



రేణిగుంట, తెలంగాణ ముచ్చట్లు : ఆక్టోపస్ మరియు పోలీస్ దళాలు శనివారం వేకువజామున రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం లో మాక్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ అర్ధరాత్రి ప్రారంభమై ఉదయం వరకు కొనసాగింది. ఆక్టోపస్ దళాలు మాక్ ఆపరేషన్ విమానాశ్రయం నందు అనుకొని విధముగా ఎదైనా తీవ్రమైన ఘటనలు లేదా ఉగ్రమూకలు దాడికి పాల్పడితే సిబ్బంది, ప్రయాణికులు, సందర్శకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియ జేసేందుకు ఆక్టోపస్ దళాలు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్., ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు, ఫైర్ సర్వీసు, మెడికల్ డిపార్ట్మెంట్ వారు కలసి సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. అకస్మాత్తుగా ఉగ్రమూకలు విమానాశ్రయం నందు చొరబడి దాడికి పాల్పడితే వారిని ఏ విధంగా ఎదుర్కోవాలో క్షతగాత్రులు, బందీల ప్రాణాలు ఏ విధంగా రక్షించాలి.. ప్రభుత్వ ఆస్తులను ఏ విధంగా కాపాడాలో అవగాహణ కల్పించడానికి ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అనుమానితులు తారసపడితే తక్షణమే స్థానిక పోలీసులకు లేదా విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు రేణిగుంట, కృష్ణ ఆక్టోపస్, సిఐలు గాజులమండ్యం, ఆక్టోపస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో 'త్రాగు నీటి పరిరక్షణ' కార్యక్రమం




భీమవరం, తెలంగాణ ముచ్చట్లు : శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో 'త్రాగు నీటి పరిరక్షణ' ప్రోగ్రాం ని పురస్కరించుకొని 'ఉన్నత భారత అభియాన్' ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డా. పావని ముఖ్య అతిధిగా విచ్చేశారని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఏ.అనురాధ మాట్లాడుతూ, కళాశాలలోని %ఖదీూ% వాలంటీర్స్ ఆధ్వర్యంలో ముందుగా 'ఉన్నత భారత అభియాన్' ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డా. పావని జ్యోతి ప్రజ్వలనగాంచి అనంతరం త్రాగు నీటి పరిరక్షణ మనందరి బాధ్యతని, నీటి వనరులు అంటే జీవజాలానికి ఉపయోగపడే నీటి సహజ వనరులు. నీటి ఉపయోగాల్లో వ్యవసాయ, పారిశ్రామిక, గృహ, వినోద, పర్యావరణ కార్యకలాపాలు ఉన్నాయి. అన్ని జీవులకు పెరగడానికి, పునరుత్పత్తికీ నీరు ఆవశ్యకం అని తెలియజేసారు. అనంతరం విద్యార్థులకు 'త్రాగు నీటి పరిరక్షణ' గూర్చి సెమినర్స్ ఇవ్వడం జరిగిందని అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారని తెలియజేసారు. అనంతరం 'ఉన్నత భారత అభియాన్' బెస్ట్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ అవార్డు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఏ.అనురాధ కి ప్రదానం చేయడం జరిగింది అలాగే 'ఉన్నత భారత అభియాన్' కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ బి.సురేష్ కి ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు,ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం మరియు కళాశాల యు.బి.ఏ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సురేష్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




భీమవరం,తెలంగాణ ముచ్చట్లు : ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ మేనేజర్ జి శ్రీనివాస్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణికులతో సదస్సు, పేపర్ బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అనారోగ్యానికి హేతువు ప్లాస్టిక్ అని తెలిసి కూడా విపరీతంగా ప్లాస్టిక్ ను వాడటం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని, రైల్వే ప్రయాణికులు ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని అన్నారు. ప్రయాణికులు ఏం సత్యవతి (నరసాపురం), కే శ్రీరామ్మూర్తి (భీమవరం), ఎన్ రాంబాబు (భీమవరం), సునీల దేవి (పాలకొల్లు) మాట్లాడుతూ ఈవిధమైన ప్రచారం చేయడం ఒక మంచి పరిణామమని, రైల్వే స్టేషన్, రైలులో కూడా చెత్త చేయడం దారుణమని, ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేదిస్థామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, టికెట్ కలెక్టర్ ఏం పుష్ప, వీర పట్నాయక్, ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# యనమదుర్రు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు



భీమవరం, తెలంగాణ ముచ్చట్లు : "అర్హులైన ప్రతీ ఒక్కరూ ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని, న్యాయ సేవాధికార చట్టం ద్వారా మహిళలు, పిల్లలు, షెడ్యూల్ కులాలు, తెగలకు చెందినవారు, మానసిక వికలాంగులు, ప్రకృతి వైపరీత్య బాధితులు, పారిశ్రామిక కార్మికులు, సంవత్సర ఆదాయం మూడు లక్షల లోపు ఉన్నవారందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులని, డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో కేసులను రాజీ చేసుకోవచ్చని" భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్) అన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా భీమవరం మండల యనమదుర్రు గ్రామంలోని డ్వాక్రా భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయవాదులు పి.అంబేద్కర్, ఎన్.సుధీర్, బి.సురేష్ కుమార్, ఎం.బి.భవాని, కె.జ్యోతి, డి.రవికిరణ్, ఏ.పి.ఎం. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భారీ అన్న సమారాధన..





నరసాపురం, తెలంగాణ ముచ్చట్లు : పట్టణ పరిధిలోని స్థానిక 7వ వార్డులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ నివాసం వద్ద వేంచేసి ఉన్న పుంత లో ముసలమ్మ ఆలయం వద్ద శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తు లు అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, కొవ్వలి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు నిమ్మకాయల నీలిమాలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU


# చిన్నారుల వ్యక్తిత్వ వికాస వృద్ధికి లలిత కళలు ఊతమిస్తాయన్న మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం, తెలంగాణ ముచ్చట్లు : బాల్యం నుండే చిన్నారుల్లో నటన, నృత్యం, లలిత కళలపై మక్కువ కలిగిస్తున్న నాట్యాచార్యఉమ,చిన్నారుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపిన మంత్రి దుర్గేష్ రాజమహేంద్రవరం కళా సంస్కృతిక వైభవాన్ని కొన సాగించాలన్న ఉద్దేశంతో చిన్నారుల్లో లలిత కళల పైన ప్రత్యేక ఆసక్తిని, అనురక్తిని కలిగించాలన్న ఉద్దేశంతో నాట్యా చార్య శ్రీమతి ఉమా, చిన్నారుల తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని అభినందించాల్సిందే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రం లో నాట్యాచార్య ఉమా నేతృత్వంలో ఉమా నృత్యనికేతన్ ఆధ్వర్యంలో మంజీర పాద నృత్యోత్సవం ఏడవసారి నిర్వహించుకుంటున్న సందర్భంగా ఆ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు .. ఈ సందర్భంగా వేదికపై నృత్యం చేసిన చిన్నారులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.. జాతీయ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా చిన్నారులు పాటలకు తగ్గట్టుగా అద్భుతమైన హావ భావాలను ఒలికిస్తూ నృత్యం చేయడం అలరించిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వందలాది మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చి, నృత్యకారులుగా తయారు చేస్తున్నటువంటి శ్రీమతి ఉమాను, చిన్నారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఈ సందర్భంగా అందరి తరపున ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. బాల్యం నుంచే నటన, నాట్యం,లలిత కళల పట్ల మక్కువ కలిగిస్తే వారి భవిష్యత్తు బంగారం మయమవుతుందని మంత్రి తెలిపారు. చిన్నతనంలో నేర్చుకునే కళలు వారి భవిష్యత్తు అందంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు... మొబైల్, టీవీ సంస్కృతి నుంచి పిల్లల్ని లలిత కళల వైపు మళ్లించే ప్రయత్నం చేయడం మంచి పరిణామం అన్నారు... ఒకవైపు చదువుతూనే మరోవైపు కళల పట్ల తర్ఫీదు ఇవ్వడం ద్వారా మంచి పౌరులుగా రూపుదిద్దుకునేందుకు ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు..అంతేగాక వారి వ్యక్తిత్వ ధోరణి మరింత వికసిస్తుందని అభిప్రాయపడ్డారు.

# కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతుతో పాటు దేవుడి ఆశీస్సులు: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ,తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతుతో పాటు దేవుడి ఆశీస్సులు కూడా మెండుగా ఉన్నాయన్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు. సంక్షేమఫలాలు అందుకుంటున్న కోట్లాదిమంది ప్రార్థనలు, అవ్వాతాతల దీవెనలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి దైవబలాన్ని మరింత పెంచుతున్నాయన్నారు. శనివారం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మక్కన మల్లికార్జునరావుతో కలసి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఆలయంలో స్వామి, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ధ్వజస్తంభం, వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనాలు పొందారు. వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ప్రజాబలంతో పాటు దేవుడి దీవెనలు బావుండబట్టే కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతుందని, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, పరిశ్రమలు, పెట్టుబడులు, కేంద్రం నుంచి నిధులు, పెండింగ్ సమస్యలు అన్నింటిలో సానుకూల ఫలితాలు చూస్తున్నామన్నారు.

# ఏ ఎన్ యు నుంచి 6గురికి ఉత్తమ అధ్యాపక అవార్డులు



పెదకాకాని,తెలంగాణ ముచ్చట్లు : ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. వీరిలో ఆచార్య ఎన్. వి. కృష్ణారావు (తెలుగు), ఆచార్య డి. రామచంద్రన్ (కెమిస్ట్రీ), ఆచార్య వై. అశోక్ కుమార్ (అంబేద్కర్ చైర్), ఆచార్య యం.త్రిమూర్తి రావు (సోషల్ వర్క్), డాక్టర్ పి. పూర్ణచంద్రరావు (టూరిజం), డాక్టర్ పి. బ్రహ్మాజీరావు (ఎన్విరాన్మెంటల్ సైన్స్) లు ఉన్నారు. వీరికి ఈ నెల 11వ తేదీన విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లను చేస్తోంది. కాగా ఉత్తమ అధ్యాపక అవార్డుకి ఎంపికైన దూర విద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ కు దూరవిద్య కేంద్రంలో శనివారం ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అవార్డు గ్రహీత ఆచార్య డి. రామచంద్రన్ ఉత్తమ అధ్యాపక అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం అసిస్టెంట్ రిజిస్టర్ పి. కృష్ణవేణి, సూపరింటెండెంట్ ఏం. రమాదేవి, డాక్టర్ మండూరి వెంకటరమణ, పి. దేవకాంత్, డాక్టర్ పి. భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యసేవలు అందించాలి - ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు, తెలంగాణ ముచ్చట్లు : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రాష్ట్రములో అనేక ప్రాంతాల నుండి నిరుపేదలు వచ్చి వైద్యం తీసుకుంటారని,ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా వారికి మెరుగయిన వైద్య సేవలు అందించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్లా మాధవి తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండేంట్ గా నియమితులయిన డాక్టర్ ఎస్.ఎస్.వి రమణ శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి గళ్లా మాధవిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి నిరుపేదలు అధికంగా వస్తుంటారని, వారి పట్ల వైద్య సిబ్బంది సానుకూల ధోరణితో నడుచుకోవాలని, ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి మెరుగయిన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలనీ, ఆసుపత్రి అభివృధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు.

# ఘనంగా న్యాయ సేవాధికారి సంస్థ దినోత్సవ వేడుకలు

ఏలూరు,తెలంగాణ ముచ్చట్లు : న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ పురుషోత్తం కుమార్ అధ్యక్షతన శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనము నందు న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ గత నవంబర్ 9వ తేదీ నుండి నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు చేపట్టాయని, లోక్ అదాలత్ లు నిర్వహించడం, చట్టాల పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం, పేద ప్రజలకు, స్త్రీలకు, పిల్లలకు, విభిన్న ప్రతిభావంతులు, ప్రకృతి వైపరీత్యాలకు లోనైన ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని తెలియజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక విస్తృత సేవలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు పది మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలియజేశారు. గత నవంబర్ 9వ తేదీ నుండి నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 7670 కేసులను రాజీవ్ చేయడం జరిగిందని ఇందులో 6448 క్రిమినల్ కేసులు, 690 సివిల్ కేసులు, 532 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు మరియు 634 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీవ్ చేయడం జరిగిందని తెలియజేశారు. అలాగే 155 మందికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు జరిగిందని, 716 న్యాయ విజ్ఞాన సదస్సులు మరియు ఇతర కార్యక్రమాలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి పి.మంగాకుమారి మాట్లాడుతూ కేసులను త్వరగా పరిష్కరించడానికి, కక్షిదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి ఈ న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని కావున కక్ష దారులు ఈ సేవలను ఉపయోగించుకుని కేసుల నుండి త్వరగా ఉపశమనం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె .రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కె కె.వి. బులి కృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్ వాసుదేవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మరియు పి.పి. కోనే సీతారాం, గవర్నమెంట్ న్యాయవాది బి.జె.రెడ్డి, ట్రైనీ మాస్టర్ టి. సుబ్బారావు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు, విద్యార్థులు, కక్షిదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలికి న్యాయం చేయాలి- వరికూటి అశోక్ బాబు

ఒంగోలు, తెలంగాణ ముచ్చట్లు : తీవ్ర రక్తస్రావంతో గాయపడి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నన మైనర్ బాలికను పరామర్శించేదుకు అనుమతి నిరాకరించిన పోలీసులపై జూలు విదిల్చిన వేమూరు నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జి వరికూటి అశోక్ బాబు. బాధితురాలికి న్యాయం చేయాలని దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ %ఖీ×=% కట్టేవరికు పోరాడిన వరికూటి అశోక్ బాబు.



# చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించిన అడిషనల్ ఎస్పి టి.పి.విఠలేశ్వర్

బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు : ప్రజల యొక్క సమస్యలను నేరుగా తెలుసుకు నేందుకు ప్రజల మధ్యకి పోలీస్ వెళ్లాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ "పల్లెనిద్ర" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం వారి పరిధిలోని గ్రామాల్లో బస చేస్తారు. స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకుంటారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి వాటి బారిన పడకుండా ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలి తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాలతో నవంబర్ 8న శుక్రవారం రాత్రి అడిషనల్ ఎస్పి టి.పి.విఠలేశ్వర్ చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుళ్లపల్లి గ్రామంలో "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ తోపాటు రేపల్లె రూరల్ సర్కిల్ సిఐ సురేష్ బాబు, చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై స్థానికంగా వారికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాల గురించి, చెడు నడత కలిగిన వ్యక్తుల యొక్క సమాచారం సేకరించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి వాటి బారిన పడకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా వ్యవహరించాలి అనే విషయాలను గురించి ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా ఉండడానికి పాటించవలసిన రోడ్డు భద్రత నియమాల గురించి, హెల్మెట్, సీట్ బెల్ట్ లు ధరించడం వలన కలిగే ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు.

## నామినేటెడ్ పదవుల

# రెండో జాబితా రిలీజ్



అమరావతి, తెలంగాణ ముచ్చట్లు : ఏపీలో నామినేటెడ్ పదవుల రెండో జాబితా విడుదలైంది. శనివారం ఉదయం నామినేటెడ్ పదవుల సెకెండ్ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం 59 మందితో నామినేటెడ్ పోస్టులను విడుదల చేస్తూ కూటమి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పదవుల జాబితాలో బీసీలకు అగ్రతాంబూలం అందింది. అలాగే పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభించింది. గత ఎన్నికలలో సీట్లను త్యాగం చేసిన వారికీ ఈ జాబితాలో ప్రాధాన్యత లభించింది. టీడీపీ నుంచి పట్టాభి , ఉండవల్లి శ్రీదేవి, జనసేన నుంచి చిల్లపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి సుబ్బారాయుడులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి. దూండీ రాకేష్ ఆర్యవైశ్య కార్పొరేషన్‌గా నియమితులయ్యారు. అలాగే బీజేపీ నుంచి మట్టా ప్రసాద్‌కు మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌ను కేటాయించింది. అలాగే గండి బాబ్జి, గొట్టిముక్కల రఘురామరాజు, ఆనం వెంకటరమణారెడ్డి, విజయకృష్ణ రంగారావు, కిడారి శ్రావణ్, చాగంటి కోటేశ్వరరావులకు కూడా కార్పొరేషన్ పదవులు వరించాయి.

**సెకండ్ జాబితాలో ఉన్నది వీరే..**

1. మహమ్మద్ షరీఫ్ ( నర్సాపురం-టిడిపి ) - అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( మైనార్టీ అఫైర్స్ ) క్యాబినెట్ ర్యాంక్
2. చాగంటి కోటేశ్వర్ రావు - అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ ) క్యాబినెట్ ర్యాంక్
3. కూడిపూడి సత్తిబాబు ( రాజమండ్రి - టిడిపి) - ఏపీ శెట్టి బలిజ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
4. మాల సురేంద్ర ( అనకాపల్లి - టిడిపి ) - ఏపీ గవర్న్ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
5. రోనంకి కృష్ణం నాయుడు ( నరసన్నపేట - టిడిపి )- ఏపీ కళింగ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
6. పీవీజీ కుమార్ ( మాడుగుల - టిడిపి ) - ఏపీ కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
7. దేవేంద్రప్ప ( ఆదోని - టిడిపి ) - ఏపీ కురుబ - కురుమ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
8. ఆర్ సదాశివ ( తిరుపతి - టిడిపి )- ఏపీ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
9. సావిత్రి ( అడ్వొకేట్ - బీజేపీ ) - ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
10. పాలవలస యశస్వి ( శ్రీకాకుళం - జనసేన ) - ఏపీ తూర్పు కాపు వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
11. కపత్రాల సుశీలమ్మ ( బోజమ్మ ) ( ఆలూరు - టిడిపి ) - ఏపీ వాల్మీకి, బోయ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
12. సి ఆర్ రాజన్ ( చంద్రగిరి -టిడిపి)- ఏపీ వన్యకుల క్షత్రియ ( వనేరెడ్డి, వన్నికాపు, పల్లి కాపు, పల్లి రెడ్డి) కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
13. నరసింహా యాదవ్ ( తిరుపతి - టిడిపి ) - ఏపీ యాదవ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
14. చిలకలపూడి పాపారావు ( రేపల్లె - జనసేన) - ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
15. వీరంకి వెంకట గురుమూర్తి ( పామర్రు - టిడిపి )- ఏపీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
16. గండి బాబ్జి ( పెందుర్తి - టిడిపి) - ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్
17. మంజులా రెడ్డి రెంటిచింతల - ( మాచర్ల - టిడిపి) - ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ విజయవాడ
18. నీలాయపాలెం విజయకుమార్ (తిరుపతి - టిడిపి ) - ఏపీ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు
19. జీవి రెడ్డి ( మార్కాపురం - టిడిపి ) - ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్
20 . మన్నవ మోహన్ కృష్ణ ( గుంటూరు వెస్ట్ టిడిపి ) - ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్
21. తేజస్వి పొడపాటి ( ఒంగోలు - టిడిపి) - ఏపీ కల్చరల్ కమిషన్
22. పొలంరెడ్డి దినేష్ రెడ్డి ( కోవూరు - టిడిపి ) - ఏపీ ఎన్విరాన్మెంట్ మ్యానేజ్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
23. సుజయ్ కృష్ణ రంగారావు ( బొబ్బిలి - టిడిపి ) - ఏపీ ఫారెస్ట్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
24. గోనుగుంట్ల కోటేశ్వర రావు ( నరసరావుపేట - టిడిపి ) - ఏపీ గ్రంథాలయ పరిషద్
25. దేగల ప్రభాకర్ ( గుంటూరు ఈస్ట్ - టిడిపి ) - ఏపీ ఇండస్ట్రియల్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
26. కేకే చౌదరి ( కోడూరు - టిడిపి ) - ఏపీ ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు
27. చిల్లపల్లి శ్రీనివాస రావు ( జనసేన ) - ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
28. ప్రగడ నాగేశ్వర రావు ( యలమంచిలి - టిడిపి ) - ఏపీ రోడ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
29. మరెడ్డి శ్రీనివాస రెడ్డి ( ఒంగోలు - టిడిపి ) - ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్
30. ఆనం వెంకట రమణా రెడ్డి ( నెల్లూరు రూరల్ - టిడిపి ) - ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవెలప్మెంట్ అథారిటీ
31. రఘురామ రాజు గొట్టిముక్కల ( విజయవాడ సెంట్రల్ - టిడిపి ) - ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ
32. సావల దేవదత్ (తిరువూరు - టిడిపి ) - ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ
33. రావి వెంకటేశ్వర రావు ( గుడివాడ - టిడిపి ) - ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్
34. కావాలి గ్రీష్మ ( రాజాం - టిడిపి ) - ఏపీ ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్
35. దోన్ను దొర - టిడిపి( విజయనగరం జోన్ ) , రెడ్డి అప్పల నాయుడు - జనసేన( విజయవాడ జోన్ ), సురేష్ రెడ్డి - బీజేపీ( నెల్లూరు జోన్ ) , పోలా నాగరాజు - టిడిపి ( కడప జోన్ ) - ఏపీఎస్ఆర్టిసి రీజనల్ బోర్డు ఛైర్మెన్
36. సజ్జా హేమలతా ( చీరాల - టిడిపి ) - ఏపీ హ్యాండ్ లూమ్ కోపరేటివ్ సొసైటీ
37 . గుమ్మడి గోపాల కృష్ణ ( పామర్రు - టిడిపి ) - ఏపీ నాటక అకాడమీ
38. సీతారామ సుధాకర్ ( విశాఖపట్నం సౌత్ - టిడిపి )- ఎన్టీఆర్ వైద్య సేవ
39. కొమ్మారెడ్డి పట్టాభి రామ్ ( విజయవాడ వెస్ట్ - టిడిపి ) - స్వచ్ఛ్ ఆంధ్రప్రదేశ్ మిషన్
40 . స్వామినాయుడు ఆలాడ ( అమలాపురం - టిడిపి ) - అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
41. టిసి . వరుణ్ - (అనంతపూర్ - జనసేన ) -అనంతపూర్ - హిందూపూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
42. రూపానంద రెడ్డి ( కోడూరు - టిడిపి ) - అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
43. సలగల రాజశేఖర్ బాబు ( బాపట్ల - టిడిపి ) - బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
44. తెంటు లక్ష్మి నాయుడు ( బొబ్బిలి - టిడిపి ) - బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
45. కే. హేమలత ( చిత్తూరు - టిడిపి ) - చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
46. తుమ్మల రామస్వామి ( కాకినాడ - జనసేన ) - కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
47. సోమిశెట్టి వెంకటేశ్వర్లు ( కర్నూలు - టిడిపి ) - కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
48. మట్టా ప్రసాద్ ( మచిలీపట్నం - బీజేపీ ) - మచిలీపట్టణం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
49. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ( నెల్లూరు రూరల్ - టిడిపి ) - నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
50. బోడ్డు వెంకటరమణ చౌదరి ( రాజానగరం - టిడిపి )- రాజమండ్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
51. కోరికన రవికుమార్ ( శ్రీకాకుళం - జనసేన )- శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ
52. ప్రణవ్ గోపాల్ ( విశాఖపట్నం ఈస్ట్ ) - విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవెలప్మెంట్ అథారిటీ
53. ముస్తాక్ అహ్మద్ ( నంద్యాల టిడిపి) - ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్
54. డి. రాకేష్ ( విజయవాడ వెస్ట్ - టిడిపి) - ఏపీ ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
55 . వి. సూర్యనారాయణ రాజు ( కనకరాజు సూరి ) ( భీమవరం - జనసేన )- ఏపీ క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
56. కొత్తపల్లి సుబ్బారాయుడు ( నరసాపురం - జనసేన) - ఏపీ స్టేట్ కాపు వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్
57. ఉండవల్లి శ్రీదేవి ( తాడికొండ - టిడిపి ) - ఏపీ మాదిగ వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం నందు మొత్తం ఆదాయం రూ.72,880 లు..1,500 మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ



భీమవరం,తెలంగాణ ముచ్చట్లు : భీమవరం గునుపూడి లో వేంచేసి యున్న శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం నందు కార్తీకమాసోత్సవములలో భాగంగా శుక్రవారం 7వ రోజు సందర్భముగా సేవలు నిమిత్తం రూ. 6,316 లు, దర్శనం వలన రూ. 19,950, లడ్డు ప్రసాదం వలన రూ. 3045 లు, అన్నదానం ట్రస్టు నిమిత్తం రూ. 43,569 లు మొత్తం రూ. 72,880 లు ఆదాయం రాగా ఈ రోజు 1,500 మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయుట జరిగినదని, ఈ కార్యక్రమం నందు గ్రామస్తులు, భక్తులు పాల్గొని సహాయ సహకారములు అందిచినారని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణంరాజు తెలిపారు.

## విశ్రాంత ఉపాధ్యాయులు శర్మను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వచనాలు తీసుకున్న..1986, 87 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు



పాలకోడేరు, తెలంగాణ ముచ్చట్లు : పాలకోడేరు మండలం శృంగవృక్షం జెడ్ పి హెచ్ స్కూల్ లో ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైర్ అయిన విశ్రాంత ఉపాధ్యాయులు శర్మ (95)ని ఆయన నివాసం ఉంటున్న ఆకివీడు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పండ్లు, జ్ఞాపిక, వెండి గ్లాసు అందించిన 1986, 87 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి శర్మ వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు, పూర్వ విద్యార్థులు కుసుమ గుప్తా, కూర్మాల శ్రీనివాస్, ప్రసాద్, సత్తి పండు, సాయిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. మిగతా 1986, 87 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు అందరూ శర్మ వారి ని కలవడంతో ఎంతో సంతోసాన్ని వ్యక్తం చేసారు.

## శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానం కి శృంగవృక్షం కి చెందిన మేడిది వరలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమార్తె కొప్పుల లక్ష్మి సరస్వతి రూ. 1,00116 లు విరాళం...



భీమవరం,తెలంగాణ ముచ్చట్లు : శుక్రవారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానం కి పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన మేడిది వరలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమార్తె కొప్పుల లక్ష్మి సరస్వతి 1,00116 ఒక లక్ష నూట పదహారు రూపాయలు విరాళంగా అందచేసినారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి ప్రసాదాలు అందచేసినారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలియచేసినారు.

## చురుగ్గా సాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు



అచ్చంపేట, తెలంగాణ ముచ్చట్లు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని పొందుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. పెదకూరపాడు నియోజకవర్గం శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఇచ్చిన పిలుపుతో మండల గ్రామాల్లో ఉన్న టీడీపీ నేతలు సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొంటున్నారు... మండలంలోని కోనూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా జరిగింది.. మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించిన అడిషనల్ ఎస్పి టి.పి.విఠలేశ్వర్





బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు : ప్రజల యొక్క సమస్యలను నేరుగా తెలుసుకు నేందుకు ప్రజల మధ్యకి పోలీస్ వెళ్లాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ "పల్లెనిద్ర" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం వారి పరిధిలోని గ్రామాల్లో బస చేస్తారు. స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకుంటారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి వాటి బారిన పడకుండా ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలి తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాలతో నవంబర్ 8న శుక్రవారం రాత్రి అడిషనల్ ఎస్పి టి.పి.విఠలేశ్వర్ చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుళ్లపల్లి గ్రామంలో ''పల్లెనిద్ర'' కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ తోపాటు రేపల్లె రూరల్ సర్కిల్ సిఐ సురేష్ బాబు, చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై స్థానికంగా వారికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాల గురించి, చెడు నడత కలిగిన వ్యక్తుల యొక్క సమాచారం సేకరించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి వాటి బారిన పడకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా వ్యవహరించాలి అనే విషయాలను గురించి ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా ఉండడానికి పాటించవలసిన రోడ్డు భద్రత నియమాల గురించి, హెల్మెట్, సీట్ బెల్ట్ లు ధరించడం వలన కలిగే ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులకు అండగా పోలీసు శాఖ ఉంటుందన్నారు. ఎవ్వరైనా వారిపట్ల అసభ్యకరంగా వ్యవహరించినా, వెంటపడి వేధించినా, నేరాలకు పాల్పడినా చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వలన మద్యం మత్తులో వారు ఏదైనా నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుంది కనుక శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నేరాలను కట్టడి చేసే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు (లేదా) డయల్ 100, 112 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా వుంచబడతాయని ప్రజలకు తెలిపారు.

# కందుకూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో ముఖద్వారం వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మాణం



కందుకూరు,తెలంగాణ ముచ్చట్లు : కందుకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో ముఖ ద్వారం వద్ద స్పీడ్ బ్రేకర్లు సోమవారం ఏర్పాటు చేయుటకు రోడ్డును పగలగొడుతున్న దృశ్యం... ఈ విషయమై డిపో ఇన్చార్జి మేనేజర్ ఆర్ .శ్రీనివాసరావు తో మాట్లాడగా, ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో డిపో లోపలికి వచ్చే వాహనాలను కోవూరు రోడ్డు వైపు మళ్లించామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. డిపోలోని ప్లాట్ఫాముల ఎత్తును కూడా పెంచుతున్నామని ఆయన చెప్పారు.

# పాలనను గాలికొదిలేసి వేరే రాష్ట్రాలకు పర్యటనలా..?

## సీఎం, మంత్రులను నిలదీసిన హరీశ్‌రావు

హైదరాబాద్ : పాలనను గాలికొదిలేసి సీఎం, మంత్రులు పక్కరాష్ట్రాలకు వెళ్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అలాగే మంత్రులు వారి సొంత శాఖలపై నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని కామెంట్స్ చేశారు. మంత్రులు ఉత్తమ్, భట్టి విక్రమార్క, సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని సమస్యలను గాలికి వదిలేసి వేరే రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా సీఎం, మంత్రులపై ఫైర్ అయ్యారు హరీష్ రావు. పాలనను వదిలి ముఖ్యమంత్రి, మంత్రులు పక్క రాష్ట్రాల పర్యటనలు చేస్తున్నారని మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ సొంత జిల్లాలోనే వడ్ల కొనుగోళు ళ జరగవన్నారు. బిల్లులు విడుదల చేయడం లేదని గ్రామ పంచాయతీ కార్యాలయం తాకట్టు పెట్టే పరిస్థితి వచ్చినా ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంత్రి సీతక్క జిల్లాలోనే మద్దతు ధరకు పత్తి అమ్ముకోలేక రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా కనికరించరని వ్యాఖ్యలు చేశారు. ఫుడ్ పాయిజనింగ్ జరిగి గురుకులాల్లో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడరన్నారు. ఇన్ని సమస్యలు అంటే.. ఇవేవీ పట్టనట్లు, రాష్ట్ర ప్రజలకు సమస్యలే లేనట్లుముఖ్యమంత్రి సహా మంత్రులు పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి పయనమయ్యారని దుయ్యబట్టారు.పాలన గాలికివదిలి ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,కేరళకుమంత్రిసీతక్క,మహారాష్ట్రకుముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యూకట్టినపరిస్థితిఏర్పడిందన్నారు.

# కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి...

**- భీమవరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన ర్యాలీ...**

**- భీమవరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అంకెం.సీతా రామ్...**

**- జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు...**




భీమవరం, తెలంగాణ ముచ్చట్లు : పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు భీమవరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి సమీ పంలో గల సబ్ స్టేషన్ వద్ద కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన ర్యాలీ ని నిర్వహించడం జరిగింది. అనంతరం భీమవరం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ అంకెం.సీతారా మ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమంటూనే ట్రూ ఆప్ చార్జీల పేరుతో రానున్న రెండేళ్లలో ప్రజలపై 20వేల కోట్లు భారాన్ని వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు ట్రూ ఆప్ చార్జీల పద్ధతిని స్మార్ట్ మీటర్ బిగించే ప్రయత్నాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పాతపాటి హరి కుమార్ రాజు మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలి. ఈ ఆరు నెలల్లో ప్రజలపై పడుతున్న 6000 వేల కోట్ల భారాన్ని తగ్గించాలి అదేవిధంగా నిత్యవసర వస్తువులపై ఉన్న ధరలను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల సబ్ స్టేషన్ వరకు కరెంటు బిల్లు జేబుకు చిల్లు ఐదు నెలల్లో 18 వేల కోట్ల భారం సిగ్గు సిగ్గు ప్లకార్డులతో ర్యాలీని నిర్వహించా రు.కార్యక్రమములో ఏడు నియోజకవర్గాల కోఆర్డినేటర్స్ భీమవరం కాంగ్రెస్ పార్టీ ఇం చార్జ్ అంకెం.సీతారామ్ ఉండీ నియోజ కవర్గం గోపాలకృష్ణం రాజు, హరికిరణ్ పాలకొల్లు, సతీష్ ఆచంట,కడలిరామా రావుతణుకు,వంశీరెడ్డి,డి.రామకృష్ణ,జిల్లా యూత్ అధ్య క్షులు సోము నాగ కేశవ్ బాబు, మద్దాల. సాయికుమార్,భీమ వరం పట్టణ అధ్యక్షులు బోనం రవికుమార్ మేడపాటి సాగర్ గంజాల.సుబ్రహ్మణ్యం కొల్లి. శ్రీనివాస్ ఏవి రామరాజు, ఎస్సీనాయకులు రాజ్ కుమార్ దుండి.రవివర్మ, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పర్యాటక రంగంలో

# అద్భుత ఆవిష్కరణ "సీ ప్లేన్"

## ఏపీలోనే తొలిసారి సీ ప్లేన్ పర్యాటకాన్ని ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు














శ్రీశైలం- నంద్యాల జిల్లా,తెలంగాణ ముచ్చట్లు : విజయవాడ ప్రకాశం బ్యారేజ్ పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలానికి స్లీప్లేన్ లో ప్రయాణించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర విమానయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఏపీలో తొలిసారి సీప్లేన్ సేవలు ప్రారంభం. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో... శ్రీశైలం పాతాళ గంగలో సీ ప్లేన్ డెమో లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మరియు ఎఫ్ఐసీసీఐ పార్ట్నర్స్ గా ఉన్నారు. శనివారం విజయవాడ పున్నమి ఘాట్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "సీ ప్లేన్" ప్రారంభించి కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి అందులో ప్రయాణించి శ్రీశైలానికి విచ్చేశారు. శ్రీశైలం పాతాళగంగలో సురక్షితంగా "సీ ప్లేన్" ల్యాండ్ అయ్యింది. ఈ అద్భుత ఆవిష్కరణ వీక్షించిన పాతాళగంగ లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తమ హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు.

# సినిమా న్యూస్



## పవన్ 'బంగారం' మరింత అందంగా..!



పవన్ కళ్యాణ్ తో 'బంగారం' సినిమాలో హీరోయిన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మీరా చోప్రా. ఇండస్ట్రీలో ఈ అమ్మడికి మొదటి సినిమాతోనే నిరాశ ఎదురైనా ఆఫర్లు మాత్రం బాగానే వచ్చాయి. బంగారం సినిమా తర్వాత వరుసగా తమిళ సినిమాలకి పరిమితం అయిన మీరా చోప్రాకి తెలుగు లో మళ్లీ 'వాన' అనే సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా కూడా మీరా చోప్రాకి నిరాశను మిగిల్చింది. టాలీవుడ్‌లో ఈ అమ్మడికి కలిసి రాదని అంతా భావించారు. ఆఫర్లు రావడం కష్టం అయింది. మరో వైపు ఇతర భాషల్లోనూ ఈమెకు ఆఫర్లు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఇండస్ట్రీకి దూరం అయ్యే పరిస్థితి వచ్చింది. కొన్నాళ్లు సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న మీరా చోప్రా రీ ఎంట్రీ ఇచ్చింది. గత ఏడాది ఒక హిందీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కరోనా తర్వాత మీరా చోప్రా నుంచి వచ్చిన మొదటి సినిమా అదే కావడం విశేషం. మీరా చోప్రా సోషల్ మీడియాలోనూ ఈమధ్య కాలంలో తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు ఇరవై ఏళ్లు అవుతున్నా అదే అందం, అదే జోష్ మీరా చోప్రాలో కనిపిస్తోంది అంటూ సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు చూస్తూ నెటిజన్స్ కామెంట్స్ చేయడంతో పాటు ఫోటోలకు తెగ లైక్స్ చేస్తున్నారు. తాజాగా మరోసారి మీరా చోప్రా అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి బంగారం బ్యూటీ బంగారం వర్ణపు చీర కట్టులో చాలా కూల్ అండ్ క్యూట్ లుక్ లో కవ్విస్తూ ఫోజ్ ఇచ్చింది. ఈ స్థాయి అందం ఉన్నా మీరా చోప్రాను ఎందుకు ఫిల్మ్ మేకర్స్ పట్టించుకోవడం లేదు అంటూ కామెంట్స్ వస్తున్నాయి. నిరూపించుకునేందుకు ఒక్క ఛాన్స్ వస్తే ఈ అమ్మడు చాలు అన్నట్లుగా మీరా చోప్రా ఎదురు చూస్తున్నట్లుగా ఆమె ఫోటో షూట్స్ ను చూస్తే అర్థం అవుతుంది అంటూ మీడియా వర్గాల వారితో పాటు సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపిస్తున్నాయి. హీరోయిన్స్ కొంత గ్యాప్ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి మంచి విజయాలను సొంతం చేసుకున్న దాఖలాలు చాలానే ఉన్నాయి.

## పింక్ లో ఉప్పెన పాప.. సొగసు చూడతరమా



టాలీవుడ్ గ్లామరస్ క్యూట్ బ్యూటీ కృతి శెట్టి ఈమధ్య కాస్త స్లో అయ్యింది. మొదట్లో వరుసపెట్టి అవకాశాలు అందుకున్న అమ్మడు ఒక్కసారి రెమ్యునరేషన్ ను కోటి దాటించేసింది. ఇక ఎవరికి అందనంత ఎత్తులో వెళుతుందని అందరూ అనుకున్నారు. కానీ అమ్మడు ఆ తరువాత వరుస డిజాస్టర్స్ తో ఒక్కసారిగా డౌన్ అయ్యింది. ఇక సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా కూడా తన గ్లామర్, మాడర్న్ స్టైల్‌తో యూత్‌ని ఎంతగానో ఆకర్షిస్తోంది. సౌత్ ఇండస్ట్రీలోని ఇతర కథానాయికల కంటే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న ఈ అందాల రాశి, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పింక్ డ్రెస్‌లో మెరిసిపోతూ కొన్ని స్టైలిష్ ఫోటోలను పోస్ట్ చేసింది. కృతి తన డ్రెస్సింగ్ స్టైల్ లో ప్రతి చిన్న డీటైల్‌ని బాగా హైలైట్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ పింక్ అవుట్‌ఫిట్‌లో ఉన్న కృతి ఫోటోలు చూస్తుంటే ఒక వైపు ఆమె సాఫ్ట్‌నెస్‌ను హైలైట్ చేస్తూనే, మరొక వైపు ఆమె ఫ్యాషన్ సెన్స్‌కి సంబంధించిన లోతైన అనుభవాన్ని తెలియజేస్తున్నాయి. ఈ డ్రెస్‌లో కృతి, సాంప్రదాయాన్ని, లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్ ను కలగలిపి సరికొత్తగా కనిపించింది. ఈ డ్రెస్సింగ్‌తో ఆమె తనను తాను ఫ్యాషన్ ఐకాన్‌గా నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ ఫోటోలు కేవలం అందరి దృష్టిని ఆకర్షించడమే కాకుండా, సోషల్ మీడియాలో ఫ్యాన్ ఫాలోయింగ్ ను పెంచుతోంది. కృతికి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోవర్స్ నుండి ఈ పిక్స్ కు అమితమైన స్పందన లభించింది. ఇక ఆమె కెరీర్ విషయానికి వస్తే ఉప్పెన సినిమాతో సాలీడ్ ఎంట్రీ ఇచ్చిన కృతి ఆ తరువాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు లాంటి సినిమాలతో వరుస హిట్స్ సొంతం చేసుకుంది. ఇక వాటి తరువాత ఆమె చేసిన సినిమాలు వరుసగా ఫ్లాప్స్ అయ్యాయి. ఇటీవల వచ్చిన మనమే సినిమా కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు చేస్తోంది. అలాగే తెలుగులో కూడా ఆమె మీడియం రేంజ్ హీరోతో ఛాన్స్ అందుకున్నట్లు టాక్.

## అనుపమ.. చీరలో చందమామ..



మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రకృతి మధ్య విహరిస్తూ అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. అభిమానులకు అమ్మడు తన కొత్త లుక్‌ను పరిచయం చేసిన విధానం చాలా డిఫరెంట్ గా ఉంది. అందమైన చీరలో ప్రకృతి సోయగాల మధ్య ఆమె హాయిగా నవ్వులు చిందిస్తూ కనిపిస్తుండటంతో ఈ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అనుపమ తన చిరునవ్వుతోనే ఎట్రాక్ట్ చేస్తోంది. ఇక ఆమె చీర అందానికి పెద్ద ఎత్తున పాజిటివ్ రియాక్షన్స్ వస్తున్నాయి. ఈ ఫోటోల్లో అనుపమ చెట్లతో కూడిన ప్రదేశంలో ఉత్సాహంగా, ఆహ్లాదంగా విహరిస్తూ కనిపించారు. ఆమె చీర, ఆ చీరపై పడిన పగటిపొద్దు కిరణాలు ఆమె అందాన్ని మరింత మెరిపిస్తున్నాయి. అలా సాంప్రదాయబద్ధమైన చీరలో తన అందాన్ని ఎలివేట్ చేస్తూ అనుపమ చూపిన నవ్వులు నెటిజన్లకు కనువిందుగా మారాయి. "కాదల్ ముగమ్ కండుకోండేన్" అంటూ అనుపమ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. ఆమె చీరలో ఈ అందమైన ఫోటోలు చూసిన అభిమానులు కాస్తా ఔరా అనకుండా ఉండలేకపోతున్నారు. ప్రాచీన గమకాలు ఉన్న ఈ చీరలో ఆమె అందం ఒక సరికొత్తగా మెరిసిపోతోంది. ఇక అనుపమ తాజా ప్రాజెక్టులు పరిశీలిస్తే, "టిల్లు స్క్వేర్" సినిమాలో తన గ్లామర్ పాత్రతో కొత్తదనం చూపించి, ప్రేక్షకులను ఎట్రాక్ట్ చేశారు. అనుపమ ఇటీవల రెగ్యులర్ కమర్షియల్ పాత్రలు కాకుండా ప్రాధాన్యత ఉన్న పాత్రలను మాత్రమే ఎంపిక చేసుకుంటూ సుదీర్ఘ కెరీర్ కోసం అడుగులు వేస్తున్నారు. గ్లామర్‌తో పాటు, కథానాయకిగా విలువైన పాత్రలను పోషించాలనే ఆమె దృక్పథం అభిమానులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం అనుపమ తెలుగులో పాన్ ఇండియా సినిమాల్లో నటించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లోనూ అవకాశాల కోసం ఆలోచిస్తున్న అనుపమ, త్వరలో మరిన్ని కొత్త సినిమాల్లో కనపడతారని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు. ఇక ప్రస్తుతం ఆమె చేతిలో 4 మలయాళం సినిమాలు ఉన్నాయి. అలాగే మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. మరి ఆ సినిమాలు అనుపమకు ఎలాంటి విజయాన్ని అందిస్తాయో చూడాలి.

## మహా నగరంలో శివాని బోల్డ్ లుక్



శివాని రాజశేఖర్ తాజాగా అమెరికా మహానగరం న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో తీసుకున్న ఫోటోలు సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి. బోల్డ్ మరియు గ్లామరస్ లుక్ తో ఉన్న ఈ ఫోటోలు ఆమె అభిమానులను అబ్బురపరుస్తున్నాయి. ఈ ఫోటోలో శివాని బ్రౌన్ కలర్ డ్రెస్సులో హైహీల్స్ ధరించి న్యూయార్క్ వీధుల మధ్య తన గ్లామర్ ను ప్రదర్శించింది. ఆమె సింప్లిసిటీ, కాన్ఫిడెన్స్ ఒక ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ఈ ఫోటోలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. "లివింగ్ లెజెండ్" అంటూ తన ఫ్రెండ్‌ని ట్యాగ్ చేసి ఈ ఫోటోలను షేర్ చేసింది శివాని. సాధారణ డ్రెస్సులోనే శివాని తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌ను ప్రదర్శిస్తూ, స్టైలిష్ లుక్ తో మెరిసిపోయింది. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు శివాని గ్లామర్ కి ఫిదా అవుతూ బ్యూటీ ఇన్ బౌల్డ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. శివాని రాజశేఖర్ గతంలో కూడా పలుసార్లు తన గ్లామర్ ఫోటోషూట్స్ తో ఆకట్టుకుంది. ఆమె ఫోటోషూట్స్‌లోని స్టైల్, కాన్ఫిడెన్స్ తో యువతకు ఫ్యాషన్ ఐకాన్ గా మారింది. ఈ ఫోటోలు ఆమెకు వచ్చిన భారీ ఫాలోయింగ్‌కు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ప్రతి ఫోటోలో గ్లామర్ ని ప్రదర్శిస్తూ కూడా తన ప్రొఫెషనల్ లుక్ ని కాపాడుకోవడం ఆమె ప్రత్యేకత. మరికొందరు అభిమానులు శివాని రాజశేఖర్‌ని అందాల బోమ్మ అని అంటున్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in